సాక్షి
మంచిర్యాల
శుక్రవారం । 18 । జూలై । 2025



సింగరేణిలో ఆర్టీఐకి అడ్డంకులు
సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలో ఆర్టీఐ దరఖాస్తులకు అడ్డంకి ఏర్పడింది. సమాచార అధికారుల నియామకంలో జాప్యంతో దరఖాస్తుల స్వీకరణ నిలిచిపోయింది. 8లో▸



అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు
అంతర్రాష్ట్ర దొంగల ముఠాను నిర్మల్ పోలీసులు అరెస్టు చేశారు. జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలని చోరీలకు పాల్పడ్డారని పోలీసులు వెల్లడించారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
33.0 /27.0
వాతావరణం
ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అదనపు కలెక్టర్ చంద్రయ్య బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ కుమార్‌దీపక్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రయ్య

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పి.చంద్రయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ కుమార్ దీపక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. చంద్రయ్యను జిల్లా పౌర సంబంధాల అధికారి ఎం.కృష్ణమూర్తి మర్యాద పూర్వకంగా కలిశారు.

టీఎన్జీవోస్ సభ్యుల సన్మానం
మంచిర్యాలటౌన్: జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) పి.చంద్రయ్యను గురువారం టీఎన్జీవోస్ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, జిల్లా ఉపాధ్యక్షుడు రామ్‌కుమార్, తిరుపతి, సంయుక్త కార్యదర్శి సునీత, మంచిర్యాల యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్, అజయ్, సూపరింటెండెంట్ వసంత కుమార్, గంగారం, కార్తీక్, అజయ్, వెంకటస్వామి పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల ఆందోళన



కన్నెపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ

భీమిని: పాస్‌బుక్‌కు ఒక బస్తా యూరియా ఇస్తామని వ్యవసాయ అధికారులు చెప్పడంతో కన్నెపల్లిలో రైతులు గురువారం ఆందోళన చేపట్టారు. ఏడీఏ సురేఖ అక్కడికి చేరుకుని రైతులు ఆందోళన చెందవద్దని, యూరియా కొరత ఉందని తెలిపారు. ఫర్టిలైజర్ దుకాణాలు, డీసీఎంఎస్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని, వారి ఖాతాదారులకు ఇస్తున్నారని రైతులు తెలిపారు. దీంతో ఆమె హాకా, డీసీఎంఎస్ సెంటర్ నిర్వాహకులతో మాట్లాడి రైతులకు యూరియా ఇవ్వాలని సూచించారు. టోకెన్లు ఇచ్చి యూరియా పంపిణీ చేయాలని ఏఈవోకు సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కన్నెపల్లిలోని ఫర్టిలైజర్ దుకాణాలు తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. వీగాం, కన్నెపల్లి, ముత్తాపూర్ గ్రామాల్లో దుకాణాలు తనిఖీ చేశారు. ఎమ్మార్పీకే విత్తనాలు, ఎరువులు విక్రయించాలని సూచించారు. కన్నెపల్లి, భీమిని, నెన్నెల ఏవోలు సాయిప్రశాంత్, యమునదుర్గా, సృజన పాల్గొన్నారు.

ఎరువులు పంపిణీ చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కోటపల్లి: రైతులకు సరిపడా ఎరువుల బస్తాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం కోటపల్లిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజారమేష్ మాట్లాడుతూ ఎరువుల కోసం రైతులు ఆధార్‌కార్డులు, చెప్పులు వరుసలో ఉంచి నాలుగైదు రోజులు పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. సకాలంలో ఎరువులు ఇవ్వలేని మంత్రి వివేక్ రాజీనామా చేయాలని అన్నారు. ఎస్సై రాజేందర్ ఆందోళనను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సాంబగౌడ్, యూత్ అధ్యక్షుడు విద్యాసాగర్, మాజీ జెడ్పీటీసీ తిరుపతి, మాజీ ఎంపీపీ బాపు, మాజీ సర్పంచ్ కృష్ణ, మాజీ కౌన్సిలర్ రెవెల్లి మహేశ్, నాయకులు స్వామి, భారతి, చిరంజీవి, నాయబ్, సంపత్ పాల్గొన్నారు.

ప్రాజెక్టులు నిండలే..



నీల్వాయి ప్రాజెక్టు

జిల్లాలో చెరువులు

చెరువులు	నిండిన శాతం
589	0–25
37	25–50
7	50–70
1	75–100

- తక్కువ వర్షపాతంతో తగ్గిన ఇన్‌ఫ్లో
- ఈ సీజన్‌లో ఇప్పటికీ 50శాతం లోటు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వానాకాలం మొదలై నెల దాటుతున్నా ఆశించిన మేర వానలు కురవడం లేదు. ఈ సీజన్‌లో సకాలంలో వర్షాలు పడకపోవడంతో సాగునీటి ప్రాజెక్టులకు సరిపడా నీరు రావడం లేదు. ఇటీవలే రాష్ట్ర స్థాయి సాగునీటి శాఖ అధికారులు ఆయా ప్రాజెక్టుల కింద సాగయ్యే ఆయకట్టును ప్రకటించారు. జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టులకు ఇంకా నీరు వచ్చాక మరోసారి సమీక్ష చేశాకే ఆయకట్టు ప్రతిపాదించేలా నిర్ణయం తీసుకున్నారు. గోదావరి బేసిన్‌లో సాధారణ వర్షపాతం కూడా నమోదు కాకపోవడంతో ఈ నెల చివరి వరకు వేచి చూడనున్నారు. గత ఏడాది ఇదే సమయానికి చెరువులు, కుంటల్లో నీళ్లు మత్తడి దూకాయి. ప్రాజెక్టులకు భారీగా వరద నీరు ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో ఉంది. ఈసారి పరిస్థితులు అనుకూలంగా లేవు. దీంతో జిల్లాలో వరినారు సైతం కాస్త ఆలస్యంగా పోయడంతో వచ్చే నెలలోనూ నాట్లు వేసే అవకాశాలు ఉన్నాయి. ఈసారి అధికారులు సాగు నెల రోజుల రోజుల ముందుకు తీసుకెళ్లాలని అనుకున్నప్పటికీ వర్షాభావ పరిస్థితులతో ఆరుతడి పంటలైన పత్తి వేసిన రైతులకే కాస్త ఊరట కలుగుతోంది. రోజుల తరబడి వర్షాలు కురవకపోయినా ఆరుతడి పంటలకూ ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలున్నాయి.



గొల్లవాగు ప్రాజెక్టు

50శాతం లోటు వర్షపాతం
జిల్లాలో ఈ నెల 17నాటికి సాధారణ వర్షపాతం 327మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా ఇప్పటివరకు 164.3మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. సాధారణ వర్షపాతం కన్నా 50శాతం లోటు నమోదైంది. దీంతో చెరువులు, కుంటలు, మధ్యతరహా ప్రాజెక్టుల్లోకి వరద నీరు చేరడం లేదు. సాగునీరు రాక వానాకాలంలోనూ ఆయకట్టుకు భరోసా దక్కడం లేదు. మరోవైపు ర్యాలీవాగు, నీల్వాయి ప్రాజెక్టులు పూర్తి స్థాయి ఆయకట్టుకు నీరందించడం లేదు. ర్యాలీవాగులో సగం వరకు పూడికతో నిండిపోయి ఉంది. నీల్వాయి ప్రాజెక్టు కాలువ పనులు సిద్ధం కాకపోవడంతో ఆయకట్టు తగ్గించాల్సి వస్తోంది. ఇక జిల్లాలో మొత్తం 634 చెరువులు ఉండగా వీటితో చాలా చెరువుల్లో పావుశాతం వరకు నిండాయి. మరోవైపు చెరువులు, కుంటలు నిండకపోవడంతో మత్స్యకారులు సైతం చేపపిల్లల విత్తనాలు విడుదలపైనా సందిగ్ధం నెలకొంది. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ కాకుండా ప్రైవేటుగా కొనుగోలు చేసి పెంచుకుని ఉపాధి పొందే వందలాది మంది మత్స్యకారులు సైతం వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు.

రిజర్వాయర్	సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	మొత్తంఇన్‌ఫ్లో (టీఎంసీల్లో)	ప్రస్తుత ఆయకట్టు (ఎకరాల్లో)	ప్రతిపాదిత ఆయకట్టు (ఎకరాల్లో)
ర్యాలీ వాగు	0.408588	0.041936	0.0276	2267	2200
గొల్లవాగు	0.5675	0.0374	0.161	9500	8000
నీల్వాయి	0.846	0.429	0.027	8000	12790

ఆపరేషన్ మాకొద్దు..!

- కు.ని శస్త్రచికిత్సకు పురుషుల వెనుకంజ
- అవగాహన కల్పిస్తున్నా ముందుకొస్తున్నది కొందరే..
- జిల్లాలో కుటుంబ నియంత్రణపై అవగాహన



జిల్లాలో జనాభా నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

మంచిర్యాలటౌన్: కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయించుకోవడానికి పురుషులు వెనుకంజ వేస్తున్నారు. పురిటి నొప్పులు భరించి.. ఆపరేషన్ ద్వారా పిల్లలకు జన్మనిస్తున్న తల్లులపైనే మళ్లీ కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల భారం మోపుతున్నారు. ప్రతియేటా ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూలై 11నుంచి 18వరకు జనాభా నియంత్రణ, కుటుంబ నియంత్రణ(కు.ని) ఆపరేషన్లు, ఇతర మార్గాలపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. కానీ మహిళలు మాత్రమే ట్యూబెక్టమీ ఆపరేషన్ల(కు.ని)కు ముందుకు వస్తుండగా.. పురుషులు వ్యాసెక్టమీ ఆపరేషన్ల(కు.ని)కు ఆసక్తి చూపడం లేదు. కుటుంబ నియంత్రణ(వ్యాసెక్టమీ) ఆపరేషన్ చేయించుకునే పురుషులు ఐదు నిమిషాల్లోనే సాధారణ స్థితికి చేరుకుంటారు. పురుషులు వ్యాసెక్టమీ శస్త్రచికిత్స చేయించుకునేలా అవగాహన కల్పిస్తున్నా మహిళలతో పోలిస్తే ఆపరేషన్లు చేయించుకునే పురుషుల సంఖ్య గత నాలుగేళ్లలో 50కి కూడా చేరలేదు. కుటుంబ నియంత్రణలో భాగంగా ఈ ఏడాది ప్రభుత్వం 'శరీరం మరియు మనస్సు సిద్ధంగా ఉన్నప్పుడే తల్లి కావడానికి సరైన సమయం' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్తున్నారు.

ఆపరేషన్ సులభమైనా..
కుటుంబ నియంత్రణ పద్ధతుల్లో పురుషులకు చేసే వ్యాసెక్టమీ శస్త్రచికిత్స చాలా సులభం. కోత, కుట్టు లేని శస్త్రచికిత్స ఇది. ఐదు నిమిషాల్లోనే పూర్తయ్యే ఈ విధానంలో రక్తస్రావం ఉండదు. ఆపరేషన్ అయిన వెంటనే చిన్న చిన్న పనులు నిరభ్యంతరంగా చేసుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. పురుషులకు గతంలో కు.ని శస్త్రచికిత్స చేయాలంటే తప్పనిసరిగా కోత పెట్టాల్సి వచ్చేది. ఆధునిక విధానమైన నో స్కాల్‌పల్ వ్యాసెక్టమీ(ఎన్ఎస్‌వీ) అందుబాటులోకి రావడంతో ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలో నిర్వహిస్తున్నారు. ఈ విధానంలో ఆపరేషన్ తర్వాత కొంతసేపు విశ్రాంతి తీసుకుని ఇంటికెళ్లవచ్చు. మహిళలు ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకుంటే భవిష్యత్‌లో ఎన్నో దుష్పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. శస్త్రచికిత్స సమయంలో కూడా కడుపు కోత పెట్టాల్సి రావడంతో రక్తస్రావం అయ్యే ప్రమాదముంది. కుట్లు మానడానికి సమయం పడుతుంది. అప్పటికే ఒకట్రెండు కాన్పులు శస్త్రచికిత్స ద్వారా జరిగిన మహిళలకు కు.ని ఆపరేషన్ మరిన్ని ఇబ్బందులు తెచ్చిపెట్టే అవకాశం ఉంది.

వారం రోజులు అవగాహన
కుటుంబ నియంత్రణకు సంబంధించి అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల పరిధిలో వారం రోజులుగా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ట్యూబెక్టమీ, వ్యాసెక్టమీ ఆపరేషన్లు, ఇవి కాకుండా తాత్కాలికంగా పిల్లలు జన్మించకుండా చేపట్టే ప్రక్రియను వివరిస్తున్నారు. వ్యాసెక్టమీ ఆపరేషన్లు చేసేందుకు జిల్లాలో వైద్యులు అందుబాటులో లేకపోవడం కూడా ఆపరేషన్లు తక్కువ నమోదు కావడానికి కారణంగా తెలుస్తోంది.

జిల్లాలో గత ఐదేళ్లలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల వివరాలు

సంవత్సరం	మహిళలు	పురుషులు
2021–22	760	82
2022–23	2,423	37
2023–24	2,588	37
2024–25	2421	90
2025–26	577	0

అవగాహన కల్పిస్తున్నాం



ప్రతి ఏటా ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా కుటుంబ నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పురుషులకు వ్యాసెక్టమీ శస్త్రచికిత్సలు చేసేందుకు ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తాం. మహిళల కంటే పురుషులకు చేసే కు.ని ఆపరేషన్ల ద్వారా ఎలాంటి ఇబ్బందులు ఉండవు.
– డాక్టర్ హరీశ్‌రాజ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో వెనుకంజ

- రాష్ట్ర, జాతీయ స్థాయి ర్యాంకుల్లో చెన్నూర్, మంచిర్యాల మెరుగు
- చివరి స్థానంలో క్యాతనపల్లి

మంచిర్యాలటౌన్: స్వచ్ఛ సర్వేక్షణ్-2024 పోటీల్లో జిల్లాలోని ఏడు మున్సిపాల్టీలు వెనుకబడ్డాయి. రాష్ట్ర స్థాయిలో చెన్నూర్, జాతీయ స్థాయిలో మంచిర్యాల కాస్త మెరుగైన ర్యాంకులు సాధించాయి. రాష్ట్ర స్థాయిలో 64వ ర్యాంకుతో చెన్నూర్, జాతీయ స్థాయిలో 445వ ర్యాంకుతో మంచిర్యాల జిల్లాలో మొదటి స్థానంలో నిలిచాయి. క్యాతనపల్లి రాష్ట్ర స్థాయిలో 136వ ర్యాంకు, జాతీయ స్థాయిలో 1369వ ర్యాంకుతో జిల్లాలోనూ వెనుకబడింది. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులు ఏటా ప్రకటిస్తుండగా.. జిల్లాలోని మున్సిపాల్టీలు అంతంత మాత్రంగానే సాధిస్తున్నాయి. స్వచ్ఛత విధానాల అమలులో వెనుకబడుతూనే ఉన్నాయి. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంటు(ఘన వ్యర్థాల నిర్వహణ), చెత్త ప్రాసెసింగ్, అండర్ డ్రెయినేజీ సిస్టం లేకపోవడం, మురుగునీటి శుద్ధీకరణ, డంపింగ్‌యార్డులు సక్రమంగా లేకపోవడం, ఉన్నవాటిలో తడి, పొడి చెత్తను వేరుచేయకుండా కలిపేస్తుండడం వంటి కారణాలతో మెరుగైన ర్యాంకులు సాధించలేకపోతున్నాయి. ఏడు మున్సిపాల్టీలు బహిరంగ మల మూత్ర విసర్జన(ఓడీఎఫ్) సాధించగా.. మంచిర్యాల, చెన్నూర్ ఓడీఎఫ్+ పొందాయి.



మంచిర్యాలలో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన(ఫైల్)

హడావుడి కార్యక్రమాలు..
ఏటా కేంద్ర బృందం మున్సిపాలిటీల్లో పర్యటించి మెరుగైన పారిశుద్ధ్యం అందిస్తున్నాయా లేదా అని పరిశీలిస్తారు. వీటితోపాటు ఓవరాల్‌గా 7500 మార్కులతో ఆయా మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య పనులు, ఘన వ్యర్థాల నిర్వహణ, బహిరంగ మల మూత్ర విసర్జన, చెత్త రహిత నగరం, నగర జనాభాకు తగినట్లుగా మరుగుదొడ్లు ఉన్నాయా లేదా అనే అంశాలను పరిశీలించి మార్కులు వేస్తారు. స్వచ్ఛ సర్వేక్షణ్ సమయంలో మాత్రమే మున్సిపల్ అధికారులు హడావుడిగా పారిశుద్ధ్యం మెరుగునకు పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆయా అంశాలపై ప్రజలకు సరైన అవగాహన కల్పించి అమలు చేసేలా చర్యలు తీసుకోలేకపోయారు. ఏడాదంతా పూర్తిస్థాయిలో పారిశుద్ధ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకుంటేనే రాష్ట్ర, జాతీయస్థాయిలో మెరుగైన ర్యాంకు సాధించే అవకాశం ఉంది. గత ఏడాదితో పోలిస్తే మంచిర్యాల కొంత మెరుగైంది. గతేడాది రాష్ట్రస్థాయిలో 121వ ర్యాంకు సాధించగా, ఈ ఏడాది 72వ ర్యాంకు దక్కించుకుంది.

జిల్లాలోని మున్సిపాలిటీల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ 2024-25లో రాష్ట్ర, జాతీయ స్థాయి ర్యాంకులు

మున్సిపాలిటీ	రాష్ట్రస్థాయి ర్యాంకు	జాతీయస్థాయి ర్యాంకు	ఓడీఎఫ్ స్టేటస్
చెన్నూరు	64	636	ఓడీఎఫ్ +
మంచిర్యాల	72	445	ఓడీఎఫ్ +
నస్పూరు	75	450	ఓడీఎఫ్
మందమర్రి	116	631	ఓడీఎఫ్
బెల్లంపల్లి	121	650	ఓడీఎఫ్
లక్సెట్టిపేట	125	1234	ఓడీఎఫ్
క్యాతనపల్లి	136	1369	ఓడీఎఫ్

మొక్కలు నాటి పచ్చదనం పెంచాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- భీమారంలో వనమహోత్సవం

భీమారం: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించేందుకు పాటు పడాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రజలను కోరారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ తగ్గిన అడవుల స్థానంలో తిరిగి మొక్కలు నాటితే అవి భవిష్యత్‌లో దట్టమైన అడవులుగా మారుతాయని అన్నారు. అనంతరం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల గదిని పరిశీలించి అందులో బెడ్స్‌పై ట్రంక్ బాక్స్‌లు పెట్టారని, విద్యార్థులు ఎలా పడుకుంటారని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. స్టాఫ్‌రూం, హెడ్మాస్టర్ రూం ఒకే దానిలో నిర్వహించి ఆ గది విద్యార్థులకు కేటాయించాలని ఆదేశించారు. గది మరమ్మతుకు వ్యయంపై అంచనాలు పంపించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ విద్యాసాగర్‌ను ఆదేశించారు. డీఆర్డీవో కిషన్, ఎంపీడీవో మధుసూదన్ పాల్గొన్నారు



మొక్కకు నీళ్లు పోస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

ఆరోగ్యశ్రీలో అనాథ పిల్లలకు రక్షణ
మంచిర్యాలఅగ్రికల్చర్: అనాథ పిల్లల రక్షణ, ఆరోగ్య సంరక్షణకు ఆరోగ్యశ్రీ పథకం వర్తింపజేస్తామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టర్ చాంబర్ జిల్లా మహిళా, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ శాఖ అధికారి రౌఫ్‌ఖాన్, బాలల సంరక్షణ సమితి అధికారి ఆనంద్‌తో కలిసి అనాథ పిల్లలకు ఆరోగ్యశ్రీ కార్డులు అందజేశారు. జిల్లాలోని ఆరు బాలల సంరక్షణ కేంద్రాల్లోని 85మంది అనాథ పిల్లలకు ఆరోగ్యశ్రీ కార్డులు అందించామని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడైనా రూ.10 లక్షల వరకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్యశ్రీ సమన్వయ కర్త డాక్టర్ రాధిక పాల్గొన్నారు.

ఒప్పంద పద్ధతిన పోస్టుల భర్తీ
మంచిర్యాలఅగ్రికల్చర్: తెలంగాణ వైద్య విధాన పరిషత్, జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయం పరిధిలోని ఆసుపత్రుల్లో పోస్టులను ఒప్పంద సేవల పద్ధతిన భర్తీ చేయనున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. 9 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టుల(జనరల్ మెడిసిన్ 2, గైనకాలజిస్ట్ 2, అనస్తీషియాలజీ 2, జనరల్ సర్జరీ 1, పిడియాట్రిక్స్ 2) పోస్టులు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ నెల 19న ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లో ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు www.mancherial. telangana.gov.in వెబ్‌సైట్‌లో సందర్శించాలని తెలిపారు.

టాస్క్ ద్వారా నిరుద్యోగ యువతకు శిక్షణ
మంచిర్యాలఅగ్రికల్చర్: టాస్క్ ద్వారా జిల్లాలోని నిరుద్యోగులకు వివిధ ప్రాధాన్యత రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం టాస్క్ కేంద్రంలో ప్రపంచ యూత్ స్కిల్ డే పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి



గన్‌పూర్‌లో కార్యదర్శికి డీపీఓ సూచనలు

నెన్నెల: వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు కార్యదర్శులకు సూచించారు. గురువారం గన్‌పూర్, గొల్లపల్లి, మైలారం గ్రామ పంచాయతీలను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. రికార్డులు, పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. గన్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎంపీఓ శ్రీనివాస్, కార్యదర్శులు పద్మనాభం, సాయితేజ, వనిత పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని గోదావరి రోడ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 150మందికి లయన్స్ క్లబ్ సభ్యులు గురువారం మధ్యాహ్న భోజనం కోసం ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. క్లబ్ మంచిర్యాల శాఖ అధ్యక్షుడు కారుకూరి చంద్రమౌళి, కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, సభ్యులు సుధారాణి, వి.మధుసూదన్‌రెడ్డి, హన్మంతరావు, గోలి రాము, గుండా శ్రీనివాస్, బాలమోహన్, చందూరి మహేందర్, జ్యోత్స్న, హెచ్‌ఎం పద్మ పాల్గొన్నారు.

టీచర్ల సర్దుబాటు

- జిల్లాలో 84 మందికి డిప్యూటేషన్
- చదువులకు ఆటంకం కలుగకుండా..

మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని సర్కారు బడుల్లో ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు విద్యాశాఖ టీచర్ల సర్దుబాటు చర్యలు చేపట్టింది. మిగులు పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను కొరత ఉన్న స్కూళ్లకు సర్దుబాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మిగులు ఉపాధ్యాయులను గుర్తించి వర్క్ అడ్జస్ట్‌మెంటు చేసింది. జిల్లాలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో 84మందిని సర్దుబాటు చేస్తూ డీఈవో యాదయ్య గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది టీచర్ల కొరత అధిగమించేందుకు సర్దుబాటు చేశారు. 2024–25విద్యాసంవత్సరం ఏప్రిల్ 24న ముగియగా.. జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సర్దుబాటు చేసిన 67మంది డిప్యూటేషన్లు తక్షణమే రద్దు చేసి మళ్లీ పాత పాఠశాలల్లోనే కొనసాగించారు. ఈ ఏడాది విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగకుండా తాత్కాలిక డిప్యూటేషన్ వేశారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండి.. ఎక్కువగా ఉన్న ఉపాధ్యాయులను వర్క్ అడ్జస్ట్ పేరిట సర్దుబాటు చేశారు. విద్యార్థుల నమోదు ఆధారంగా పాఠశాలల సబ్జెక్టుల వారీగా అవసరాలను విశ్లేషించి జిల్లాలో 84మందికి డిప్యూటేషన్ ఇచ్చారు. దీంతో ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఇబ్బందులు తొలగాయి. ఖాళీలను అధిగమించేందుకు, విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగకుండా సర్దుబాటు చేశామని డీఈవో యాదయ్య తెలిపారు.

న్యాయసేవలపై అవగాహన పెంచుకోవాలి

బెల్లంపల్లి: న్యాయ సేవలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి జె.ముఖేష్ అన్నారు. గురువారం బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయ చైతన్యం, ఉచిత న్యాయసేవల ప్రాముఖ్యత తదితర అంశాలు వివరించారు. అంతకుముందు కళాశాల ఆవరణలోని మూడు వసతిగృహాలు, వసతి గదులు పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు జడ్జిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.దేవేందర్, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



పరిసరాలను పరిశీలిస్తున్న జడ్జి ముఖేష్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సుధాకర్ నాయక్

భీమిని: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్ ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలో భీమిని, కన్నెపల్లి మండలాల వైద్య సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వ్యాపించే అవకాశం ఉందని, ఈ వ్యాధులు రావడానికి దోమలే కారణమని, దోమలు విజృంభించకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అనిల్‌కుమార్ సీఎచ్‌వోలు వెంకటేశ్వర్లు, జలపతి, సుపర్‌వైజర్ ఇందిరా, హెల్త్ అసిస్టెంట్ ఉమాశంకర్, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీసీలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

క్రీడాపోటీలు సజావుగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2025–26 సంవత్సరానికి జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు సజావుగా నిర్వహించాలని డీఈవో యాదయ్య సూచించారు. గురువారం జిల్లా సైన్స్ సెంటర్‌లో ఎస్‌జీఎఫ్ సమావేశం నిర్వహించారు. గతేడాది నిర్వహించిన జిల్లా, జోనల్, రాష్ట్రస్థాయి పోటీలు, క్రీడాకారుల వివరాలు ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ ఫణిరాజా వివరించారు. ఈ సంవత్సరం క్రీడాపోటీల నిర్వహణ వేదికలపై చర్చించారు. డీఈవో యాదయ్య క్రీడాపోటీలపై సలహాలు, సూచనలు చేశారు. సమావేశంలో జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

108లో సుఖప్రసవం



శిశువుతో అంబులెన్స్ సిబ్బంది

కోటపల్లి: మండలంలోని పంగిడిసోమారం గ్రామానికి చెందిన గర్భిణి రెడ్డి లవలోకకు గురువారం పురిటినొప్పులు రావడంతో ఆమె భర్త అర్జున్న 108కి సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది అంబులెన్సులో కోటపల్లి ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో పురిటినొప్పులు అధికం కావడంతో పంగిడిసోమారం అటవీప్రాంతంలోనే సుఖప్రసవం చేయడంతో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. ఇరువురిని కోటపల్లి పీహెచ్‌సీకి తరలించారు. కార్యక్రమంలో ఈఎంటీ షబనాజ్, పైలట్ ఫరీద్, తదితరులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన నిందితుడి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రాణిసతీజీ కాలనీలో ఉన్న ఐఎఫ్‌సీ ఫుడ్‌కోర్టులో ఈనెల 15న రాత్రి జరిగిన చోరీలో నిందితుడిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. దుకాణంలోంచి రూ.వెయ్యి నగదుతో పాటు ఓ సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారని షాపు యజమాని వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు.

సిమ్స్‌లో సింగరేణికి 7 సీట్లు

శ్రీరాంపూర్: రామగుండంలోని సిమ్స్ (సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)లో కంపెనీ కోటా కింద 7 ఎంబీబీఎస్ సీట్లు కేటాయించినట్లు శ్రీరాంపూర్ డీజీఎం(పర్సనల్) ఎస్.అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఉద్యోగులు, అధికారుల పిల్లలకు ఈ సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్టుమెంట్ నందు సంప్రదించాలని ఆయన సూచించారు.

సింగరేణిలో ఆర్టీఐకి అడ్డంకులు

- సమాచార అధికారుల నియామకంలో జాప్యం
- నిలిచిన దరఖాస్తుల స్వీకరణ



శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం

శ్రీరాంపూర్: సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలో ఆర్టీఐ దరఖాస్తులకు అడ్డంకి ఏర్పడింది. కంపెనీలోనే అతిపెద్ద ఏరియా అయిన శ్రీరాంపూర్‌లో అధికారులు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ యాక్ట్ -2005) దరఖాస్తులు స్వీకరించడం లేదు. మూడు నెలలుగా ఈ ప్రక్రియ నిలిచిపోవడంతో సమాచారం కోరే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏరియా పరిధిలో ఈ చట్టం కింద దరఖాస్తులు స్వీకరించాల్సిన పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (పీఐవో), అసిస్టెంట్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అఫీసర్ (ఏపీఐవో) లేకపోవడంతో ఈ సమస్య ఉత్పన్నమైంది. పీఐవోగా బాధ్యతలు స్వీకరించిన ఓ డీజీఎం అధికారి ఏప్రిల్ 15న అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. ఆయన స్థానంలో ఎవర్నీ నియమించలేదు. ఆతర్వాత ఏపీఐవోగా బాధ్యతలు నిర్వహించిన అధికారి కూడా గత నెల ఇక్కడి నుంచి ఇతర ఏరియాకు బదిలీ అయ్యాడు. ఆ స్థానాన్ని కూడా భర్తీ చేయలేదు. దీంతో ఈ రెండు సీట్లు ఖాళీగానే ఉంటున్నాయి. పీఐవో బాధ్యతలు నిర్వహించే అధికారి మృతి చెందిన తరువాత మరో పూర్తిస్థాయి అధికారిని నియమించే వరకు ఏపీఐవోకు ఇన్‌చార్జి పీఐవో బాధ్యతలు అప్పగించడానికి అనుమతి కోరుతూ ఏరియా అధికారులు కార్పొరేట్ అధికారులకు లేఖ రాశారు. వారు ఆలస్యంగా స్పందించడంతో అలోపే సదరు ఏపీఐవో అధికారి కూడా ఇక్కడి నుంచి వేరే ఏరియాకు బదిలీ అయ్యారు. దీంతో ఈ రెండు బాధ్యతలను చూసేవారు కరువయ్యారు.

వెనుదిరిగి పోతున్న దరఖాస్తుదారులు

సమాచారం హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకోవడానికి జీఎం కార్యాలయానికి వచ్చిన కార్మికులు, సమాచార చట్టం కార్యకర్తలు, పౌర సమాజ కార్యకర్తలు అక్కడ అధికారులెవ్వరూ దరఖాస్తులు స్వీకరించకపోవడంతో వెనుదిరిగి పోతున్నారు. ఆ స్థానాల్లో అధికారులు వచ్చేంత వరకు తమకు ఈ దరఖాస్తులు స్వీకరించే అధికారం లేదని ఇతర అధికారులు వారికి చెప్పి తిప్పి పంపిస్తున్నారు. దీనికి తోడు ఇది వరకే పీఐవోకు దరఖాస్తు చేసుకున్నాక సరైన సమాచారం, స్పందన లేకపోవడంతో అప్పిలేట్ అధికారిగా ఉన్న ఏరియా జీఎంకు దరఖాస్తులు చేసుకున్న వారూ ఉన్నారు. ఆ దరఖాస్తులపై కూడా నిర్ణయం తీసుకోవాలంటే కూడా పీఐవో వద్ద సమాచారం తీసుకోవాల్సి ఉంటుంది. పీఐవో లేకపోవడంతో అప్పిలేట్ దరఖాస్తులు కూడా పరిష్కారానికి నోచుకోకుండా మరుగునపడ్డాయి. కార్పొరేట్ అధికారుల జాప్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడినట్లు తెలిసింది. చట్టబద్ధత గల ఇలాంటి పోస్టుల భర్తీలో జాప్యం చేయడం సరికాదని, ఇలా చట్టాలను నీరుగార్చుతున్నారని దరఖాస్తు దారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై రాష్ట్ర సమాచార హక్కు చట్టం పరిరక్షణ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కార్పొరేట్‌కు లేఖ రాశాం..

పీఐవో, ఏపీఐవో పోస్టులు భర్తీ చేయడం కోసం కార్పొరేట్ అధికారులకు లేఖ రాశాం. కార్పొరేట్ అధికారుల ఆదేశాల మేరకే ఈ నియామకాలు జరుగుతాయి. త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తాం.

– ఎం.శ్రీనివాస్, జీఎం, శ్రీరాంపూర్

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ షురూ



బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

నిర్మల్‌టౌన్: నిర్మల్ పట్టణ శివారులోని కొండాపూర్ వద్ద ఉన్న నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీలో గురువారం రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. మంచిర్యాల జిల్లా స్టార్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 33జిల్లాల నుంచి 180మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. గురువారం క్యాలిఫై పోటీలు నిర్వహించగా.. శుక్రవారం నుంచి ఈ నెల 20వరకు ప్రధాన పోటీలు కొనసాగుతాయి. అండర్-19 బాలురు, బాలికలు, సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. జిల్లా క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, మంచిర్యాల జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముఖేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ కిషోర్, కో కన్వీనర్, వన్నెల భూమన్న, కోఆర్డినేటర్లు సందీప్, మధుకర్‌గౌడ్, మహేష్, ప్రణీత్, నందకుమార్ పోటీలను పర్యవేక్షించనున్నారు. శుక్రవారం మెయిన్ డ్రా పోటీలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగేష్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు కానున్నారు.

మద్యానికి బానిసై ఒకరు బలవన్మరణం

ఖానాపూర్: మద్యానికి బానిసై ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన వివరాల మేరకు జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం వీవీరావుపేటకు చెందిన మండ్ల శ్రీనివాస్ గల్ఫ్ నుంచి వచ్చి కొన్నేళ్లుగా ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులకు తోడు మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య రజిత, కుమార్తెలు శ్రీనిధి, శ్రీహిత ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

బెజ్జూర్: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సర్తాజ్‌పాషా తెలిపిన వివరాల మేరకు మండలంలోని కొత్తగూడ గ్రామానికి చెందిన లెండుగూరి భీంరావు (55)భార్య విమల ఆరేళ్ల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. గురువారం మద్యం మత్తులో తన పత్తి చేనులో చెట్టుకు ఉరేసుకున్నాడు. అటుగా వెళ్లిన రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుని కుమారుడు అశ్విక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

ఆత్మహత్యకు కారణమైన ఆరుగురి అరెస్ట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఒకరి ఆత్మహత్యకు కారణమైన ఆరుగురిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపారు. జన్నారం మండలం తిమ్మాపూర్‌కు చెందిన గుండ సునీత, భూమయ్య ఉపాధి నిమిత్తం హాజీపూర్‌లో నివాసం ఉంటున్నారు. ముల్కల్లలోని సమీప బంధువులు సునీత తమను ఆర్థికంగా మోసం చేసిందని మానసికంగా వేధించి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించారు. భూమయ్య ఫిర్యాదు సుద్దాల రాజేశ్వరి, సుద్దాల సుమన్, దామెర జయకుమార్, దామెర సురేందర్, సుద్దాల మౌనిక, దండు వినోద్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

బోథ్ కళాశాల ప్రిన్సిపాల్‌పై కేసు

ఆదిలాబాద్‌టౌన్: బోథ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కోవ విఠల్‌పై వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్‌కు చెందిన తబస్సు ఖానమ్‌కు ఉద్యోగం ఇప్పిస్తానని రూ.లక్ష తీసుకున్నారని పేర్కొన్నారు. అనంత సొల్యూషన్ ఔట్‌సోర్సింగ్ ద్వారా గతేడాది ప్రభుత్వ పాఠశాల బాలక్ మందిర్‌లో కాంట్రాక్ట్ టీచర్‌గా ఉద్యోగం కల్పించినట్లు తెలిపారు. ఏడు నెలల పాటు ఉద్యోగం చేయగా, కేవలం ఒక నెలకు సంబంధించి రూ.16వేల వేతనం చెల్లించినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఆరు నెలల వేతనం ఇవ్వకపోవడంతో విధులు మానేసినట్లు తెలిపారు. ఈ విషయమై తనను మోసం చేసినట్లు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

డయల్ 100 సేవలు దుర్వినియోగపర్చిన ఒకరిపై..

నిర్మల్: అత్యవసర సమయంలో ఉపయోగించాల్సిన డయల్ 100 సేవలను మద్యం మత్తులో దుర్వినియోగపరిచిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. నర్సాపూర్ (జి) మండల కేంద్రంలో బుధవారం రాత్రి కానిస్టేబుల్ చౌహాన్ కృష్ణ, మోహన్ పెట్రో కార్ విధులు నిర్వహిస్తుండగా మండల కేంద్రానికి చెందిన తక్కల మహేష్ మద్యం మత్తులో డయల్ 100కు పలుమార్లు ఫోన్ చేసి న్యూసెన్స్ చేశాడు. దీంతో మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కడెం: మండలంలోని కొండుకూర్‌లో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని నవబ్‌పేట్‌కు చెందిన జక్కుల శ్రీనివాస్ బైక్‌పై కడెం నుంచి నవాబ్‌పేట్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో కొండుకూర్ వద్ద ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రుడిని ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సారంగపల్లిలో చోరీ

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని సారంగపల్లిలో ఆసంపల్లి స్వామి ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు స్వామి పది రోజులక్రితం ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి ఊరెళ్లాడు. బుధవారం ఇంటికి వచ్చిచూడగా తాళం తీసి ఉంది. వెంటనే లోనికి వెళ్లి బీరువాను తెరిచి చూడగా అందులో దాచి ఉంచిన రూ.22 వేల నగదు కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గుర్తించిన బాధితుడు గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

అంతర్రాష్ట్ర బైక్ దొంగల ముఠా అరెస్ట్



బైక్‌లను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

జైనథ్ : అంతర్రాష్ట్ర బైక్ దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బేల మండలానికి చెందిన సుమిత్, అతని మిత్రుడైన సలీం షకీల్‌తో కలసి మహారాష్ట్రకు చెందిన కృష్ణతో గ్యాంగ్‌గా ఏర్పడ్డారన్నారు. ఆదిలాబాద్ వన్ టౌన్, బేల, మహారాష్ట్ర కోర్పణ మండలాల్లో బైక్‌లను అపహరించి ఇతరులకు విక్రయిస్తుండేవారన్నారు. వారి వద్దనుంచి 12 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇందులో ఎనిమిదిమందిపై కేసు నమోదు చేసి నలుగురిని రిమాండ్‌కు తరలించామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన రేషన్ బియ్యంతో ఎస్సై రాజేందర్

కోటపల్లి: మంచిర్యాల నుంచి మహారాష్ట్రకు బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 33 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. కోటపల్లి మండలంలోని రాంపూర్ సమీపంలో జాతీయ రహదారిపై గురువారం తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టుబడినట్లు ఆయన పేర్కొన్నారు. డ్రైవర్ సంజయ్‌ను అదుపులోకి తీసుకుని సివిల్ సప్లై అధికారులకు సమాచారం అందించమన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

రెండోలీగ్‌లో ఓడిన ఉమ్మడి జిల్లా జట్టు



సాయికుమార్

మంచిర్యాలటౌన్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీఏ స్పార్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో రెండో లీగ్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు సాయి సత్య టీంతో 90 ఓవర్ల చాంపియన్‌షిప్‌లో ఓడిపోయింది. ఆదిలాబాద్ జట్టు మొదట బ్యాటింగ్ చేసి 30.3 ఓవర్లలో 93 పరుగులకు ఆలౌట్ కాగా అనంతరం బ్యాటింగ్ చేసిన సాయిసత్య టీం 24.3 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేసి విజయం సాధించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టులోని సాయికుమార్ 7 వికెట్లు సాధించడం గమనార్హం. పిచ్ పూర్తిగా బౌలర్లకు అనుకూలంగా ఉండడంతో, ఇరు జట్లు పరుగులను చేసేందుకు ఇబ్బంది పడ్డాయని కోచ్ ప్రదీప్ తెలిపారు.

దివ్యాంగులకు రాయితీపై రైలు ప్రయాణం



మాట్లాడుతున్న ఐఎస్ఆర్ మూర్తి

మంచిర్యాలఅర్బన్: దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి రైల్వేశాఖ రాయితీపై ప్రయాణ సౌకర్యం కల్పిస్తోందని సికింద్రాబాద్ డివిజన్ (ఎస్‌సీఆర్) అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ ఐఎస్ఆర్ మూర్తి అన్నారు. గురువారం మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో అవగాహన కల్పించారు. మంచిర్యాల కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: షట్టర్ లిఫ్టింగ్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని ఉమ్రికి చెందిన రాజుసింగ్ మోహన్‌సింగ్, సేవక్ సింగ్ రఘుబీర్‌సింగ్, సుర్జిప్ సింగ్ ముగ్గురు బంధువులు. నిర్మల్ జిల్లాలో కూలి పనులు చేసేవారు. జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 12న రాత్రి బైక్‌పై లక్ష్మణచాంద మండలంలోని కనకాపూర్ చేరుకుని పెట్రోల్ బంక్ సమీపంలోని ఇంటి ముందున్న బైక్‌ను దొంగలించారు. అనంతరం ఓ గోల్డ్‌షాప్‌లో చొరబడి బంగారం, వెండి ఆభరణాలు అపహరించారు. అదే రాత్రి ఉమ్రికి వెళ్తూ మార్గమధ్యలో కుంటాల మండలం కల్లూరు బస్టాండు సమీపంలో రెండు దుకాణాల తాళాలు పగులగొట్టి రూ.2,500ల నగదు అపహరించారు. గురువారం నిర్మల్‌లో బంగారం విక్రయించడానికి వచ్చారన్న పక్కా సమాచారంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. 2.7 కిలోల వెండి, 17 గ్రాముల బంగారం, రూ.2,500 నగదు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు వెండి ఆభరణాలను 'నిర్మల్ పోలీస్' అని అందంగా అలంకరించి, తప్పించుకోలేరని ఒక మెసేజ్ ఇచ్చారు. కేసును ఛేదించడంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సీఐ గోవర్ధన్ రెడ్డి, ఎస్సైలు శ్రీనివాస్, అశోక్, పీసీఆర్ ఎస్సై ప్రదీప్ కుమార్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ఇచ్చోడలో దొంగల బీభత్సం

- ఒకేరోజు మూడిళ్లలో చోరీ
- బంగారం, వెండి, నగదు అపహరణ



ఇంటి తాళం పగులగొట్టిన దృశ్యం

ఇచ్చోడ: మండల కేంద్రంలో బుధవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసిన మూడిళ్లలో చోరీకి పాల్పడ్డారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీకి చెందిన జాదవ్ దేవిదాస్ మూడు రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడగా కుటుంబ సభ్యులంతా ఇంటికి తాళం వేసి సొనాల మండలంలోని ఘన్‌పూర్‌కు వెళ్లారు. తాళం పగులగొట్టిన దొంగలు ఇంట్లో చొరబడి తులం బంగారం, 20 తులాల వెండి, రూ.10 వేల నగదు దొంగిలించారు. విద్యానగర్ కాలనీలోని రమేశ్ ఇంట్లో చొరబడి 4 గ్రాముల బంగారంతో పాటు నగదు అపహరించారు. అదేకాలనీలో ఉన్న చిత్రం జంగు ఇంట్లో తులం బంగారం, ఐదు తులాల వెండి దొంగిలించారు. సంతోషిమాత ఆలయం వద్ద పార్క్ చేసిన పల్సర్ 220 బైక్‌ను తీసుకెళ్లి ఆదిలాబాద్ బైపాస్ వద్ద వదిలేసి పరారయ్యారు. అప్రమత్తమైన పోలీసులు క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్ బృందాలను రప్పించి వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు.

'ఉమ్మడి జిల్లా బంద్‌కు సహకరించాలి'



మాట్లాడుతున్న వెట్టి మనోజ్

ఆదిలాబాద్: జీవో 49 రద్దు చేయాలని కోరుతూ ఈనెల 21న చేపట్టనున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బంద్‌కు సహకరించాలని తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్ కోరారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీల హక్కులకు భంగం కలిగించే విధంగా ఉన్న జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆదివాసీలు, ప్రజాస్వామ్యవాదులు, గ్రామ పటేళ్లు, రాయి సెంటర్ సార్‌మేడీలు, ఆదివాసీ కుల సంఘాలు, వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు, ప్రజా సంఘాలు బంద్‌కు స్వచ్ఛందంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడు ఆత్రం గణపతి, నాయకులు వెడ్మ బొజ్జు, ముకుందరావు, పీ. నాగోరావు, గెడం ఆనందరావు, దుర్వ జుగాదిరావు, ఆత్రం మచ్చేందర్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత



ల్యాప్‌టాప్ అందజేస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: కెరమెరి మండలంలోని నిషాని గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి ఆత్రం వంశీకృష్ణ పైచదువుల నిమిత్తం గురువారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా తన కార్యాలయంలో ల్యాప్‌టాప్ అందజేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే భవిష్యత్‌లో అపజయాలు ఉండవని, ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు.

సన్మానం

కళామందిర్ ఫౌండేషన్ ద్వారా ఇటీవల సేవారత్న పురస్కారం అందుకున్న కాత్లే మారుతిని గురువారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సన్మానించారు. ఆదిలాబాద్ మండలం చించుఘాట్ గ్రామానికి చెందిన మారుతి ఎంతోమంది గిరిజన విద్యార్థులకు విలువిద్యలో శిక్షణ ఇచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. ఫౌండేషన్ తరపున అతనికి రూ.లక్ష నగదు, జ్ఞాపిక అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, ఏసీఎంవో జగన్, జిల్లా క్రీడల అధికారి పార్థసారథి పాల్గొన్నారు.

చెరువులో పడి బాలుడు మృతి



అశ్విత్ (ఫైల్)

దిలావర్‌పూర్: ప్రమాదవశాత్తు చెరువులో పడి బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన కొప్పుల అశ్విత్ (15) బుధవారం సాయంత్రం ఆడుకోవడానికి ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. రాత్రయినా రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం మండల కేంద్రంలోని కుడి చెరువులో మృతదేహం గమనించిన స్థానికులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కాలకృత్యాల కోసం వెళ్లి చెరువులో జారిపడి మృతి చెందినట్లు అశ్విత్ తల్లి కొప్పుల పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

గడ్డెన్నవాగు ప్రాజెక్టులో పడి ఒకరు..

భైంసాటౌన్: పట్టణ శివారులోని గడ్డెన్నవాగు ప్రాజెక్టులో పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై నవనీత్ రెడ్డి తెలిపారు. మండలంలోని వానల్‌పాడ్‌కు చెందిన సిద్దివార్ రమణ (45) పట్టణంలోని కోర్వగల్లిలో నివాసముంటున్నాడు. కుమారుడు రాజుతో కలిసి ఉదయం స్థానిక గడ్డెన్నవాగు ప్రాజెక్టులో చేపల వేటకు వెళ్లగా ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నిర్మల్‌లో కిడ్నాప్ కలకలం

నిర్మల్‌టౌన్: నిర్మల్‌లో బాలుడి కిడ్నాప్‌కు యత్నం కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు నిర్మల్ మండలం అనంతపేట్‌కు చెందిన ఐదేళ్ల బాలుడికి తండ్రి కిరాణా కొట్టువద్ద బిస్కెట్ ప్యాకెట్ కొనిచ్చి ఇంటికి వెళ్లమని చెప్పాడు. అదే గ్రామానికి వెంట్రుకలు కొనుగోలు చేయడానికి ఆటోలో వచ్చిన ఆరుగురు మహిళలు బాలున్ని ఆటోలో ఎక్కించుకుని వెళ్లారు. బాలుడు ఇంటికి రాకపోయేసరికి కంగారుపడిన తల్లిదండ్రులు అనుమానంతో బంగల్ పేట్ మహాలక్ష్మి వద్ద ఉన్న తెలిసిన వారికి ఫోన్ చేసి విషయం తెలిపారు. అప్పటికే ఆ మహిళలు మహాలక్ష్మి కాలనీకి కొద్ది దూరంలో బాలుడిని దించి వెళ్తుండగా పట్టుకుని నిలదీశారు. తమకేం తెలియదని బుకాయించడంతో వారిపై దాడి చేశారు. అనంతరం మహిళలను పోలీసులకు అప్పగించారు.


పిచ్చికుక్క స్వైరవిహారం



ఆస్పత్రి ఎదుట క్షతగాత్రులు

వేమనపల్లి: మండలంలోని జక్కెపల్లిలో గురువారం ఉదయం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. ఏడుగురిపై దాడి చేసి గాయపర్చింది. అల్లాడి అనసూర్య ఎడమచేయి మణికట్టు వద్ద, ఆలం సాంబయ్య కాళ్లకు, చెన్నూరి బక్కు తల వద్ద, శనిగారపు పోశం కాళ్లకు, తలండి శ్రీనివాస్ చేతులను కొరికింది. చెన్నూరి శేఖర్‌పై పడి కొరికేందుకు ప్రయత్నించగా కర్రతో కొట్టి చంపాడు. జిల్లెడలో కూడా మరో నలుగురిపై దాడి చేసినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. క్షతగాత్రులను ఆటో సాయంతో వేమనపల్లి పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు.

కుక్క దాడిలో ఇరువురికి గాయాలు



గాయపడిన మహిళ

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో కాపువాడకు చెందిన కర్ల కళావతిపై కుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి కుక్కలను తరి మేయడంతో ప్రాణాపాయం తప్పింది. రైల్వే స్టేషన్‌కు వెళ్లే మరో ప్రయాణికునిపై కూడా కుక్క దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. బాధితులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రైల్వే స్టేషన్‌లో కుక్కల బెడద ఉందని 'సాక్షి' బుధవారమే కథనాన్ని ప్రచురించింది. అయినా అధికారులు స్పందించక పోవడంతో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైల్వే స్టేషన్ పరిసరాల్లో కుక్కల బెడదను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.